క్లుప్తంగా

డిప్యూటీ సీఎం పరామర్శ



బాధితులను పరామర్శిస్తున్న డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

మక్కువ: మండలంలోని విజయరామపురం గ్రామానికి చెందిన గిరిజనులు ఇటీవల వ్యాన్ బోల్తా ఘటనలో ప్రమాదానికి గురైన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర బుధవారం విజయరామపురం గ్రామానికి వెళ్లి బాధితులను పరామర్శించారు. వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వైద్య ఖర్చుల నిమిత్తం బాధితులకు ఆర్థిక సాయం అందజేశారు. అత్యవసర వైద్యం అవసరమైతే సంప్రదించాలని సూచించారు. ఆయన వెంట జెడ్పీటీసీ మావుడి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మావుడి రంగునాయుడు, సర్పంచ్ సీదరపు లక్ష్మి, ఎంపీపీ మర్రి పారమ్మ ఉన్నారు.

ఆగి ఉన్న వాహనాన్ని ఢీకొని వ్యాన్ బోల్తా



ప్రమాదానికి గురైన వాహనం

సీతానగరం: మండలంలోని రాష్ట్ర రహదారిలో నిడగల్లు - మరిపివలస జంక్షన్‌లో బుధవారం మధ్యాహ్నం ఆగి ఉన్న లారీని బొబ్బిలి నుంచి పార్వతీపురం వైపు వెళ్తున్న లగేజీ వ్యాన్ ఢీకొంది. స్థానికులు తెలిపిన వివరాలు... బొబ్బిలి నుంచి పార్వతీపురం దుకాణాలను దండీలు, పరపులు, ఇతర సరుకులతో వెళ్తున్న వ్యాన్ మరిపివలస జంక్షన్ వద్ద ఆగి ఉన్న లారీని ఢీకొంది. ప్రమాదంలో వ్యాన్ డ్రైవరుకు బలమైన గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం పార్వతీపురం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారని స్థానికులు తెలిపారు.

పారమ్మతల్లి జాతర ఏర్పాట్ల పరిశీలన

పాచిపెంట: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మండలంలోని పారమ్మకొండ వద్ద జరగబోయే జాతర ఏర్పాట్లను ఏఎస్పీ సురెన్ బుధవారం పరిశీలించారు. పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉండడంతో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

ఘనంగా వార్షిక కల్యాణోత్సవం



గలావల్లి శివాలయంలో వార్షిక కల్యాణంలో స్వామివారు

బలిజిపేట: గలావల్లి శ్రీ ఉమాసహిత కామలింగేశ్వర దేవాలయంలో వార్షిక కల్యాణ మహోత్సవాన్ని ధర్మకర్తలు, గ్రామ పెద్దల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. మాఘమాసం బహుళ ఏకాదశి నాడు ఆలయ వార్షికోత్సవ కల్యాణాన్ని పదేళ్ల నుంచి నిర్వహిస్తున్నట్టు అర్చకులు తెలిపారు. భక్తులు, ప్రజలు సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అర్చకులు తెలిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

'పురం'లో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేద్దాం..



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం టౌన్: పార్వతీపురంలో వైఎస్సార్‌సీపీ జెండాను మళ్లీ ఎగురవేద్దామని ఎమ్మెల్యే జోగారావు అన్నారు. మండలంలోని పులిగుమ్మి, లచ్చరాజుపేట గ్రామాల్లో మేము సిద్ధం - మా బూత్ సిద్ధం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలసి 97, 98 పోలింగ్ బూత్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ఏ విధంగా ముందుకు సాగాలన్న అంశాన్ని వివరించారు. మళ్లీ పార్వతీపురంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేసే విధంగా అంతా కలిసికట్టుగా పని చేయాలన్నారు. పార్టీ అధిష్టానం చెప్పిన ప్రతీ కార్యక్రమం విజయవంతం చేశామన్నారు. రాబోయే 40రోజులు మనందరికీ చాలా కీలకమన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు డాక్టర్ ద్వారపురెడ్డి రామ్మోహన్, జిల్లా ఉపాధ్యక్షుడు బి.కృష్ణమూర్తి, మండల పార్టీ అధ్యక్షుడు బి.రమేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష తులసి అర్చన

సాలూరు: పట్టణంలోని శ్రీనివాసనగర్ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో లక్షతులసి అర్చన బుధవారం ఘనంగా నిర్వహించారు. శాస్త్రోక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు చేశారు.

మారుమూల గ్రామాల్లో..

మునుపెన్నడూ చూడని అభివృద్ధి

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే సాకారం..
- మావుడి గిరిజన పంచాయతీలో ఐదేళ్లలో సుమారు రూ.7 కోట్లతో అభివృద్ధి పనులు
- సంక్షేమ పథకాల ద్వారా రూ.12.53 కోట్లు లబ్ధి



రైతు భరోసా కేంద్రం

సాలూరు రూరల్: మారుమూల గిరిజన గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోంది. గిరిజన గూడలను మండల కేంద్రాలు, నియోజకవర్గ కేంద్రాలతో కలుపుతూ రహదారుల నిర్మాణం చేపట్టడంతో పాటు గ్రామంలోనే విద్య, వైద్యం, తాగునీరు, వంటి మౌలిక సదుపాయాలు కల్పించడంతో గిరిజనుల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయి. సంక్షేమ పథకాలతో గిరిపుత్రుల జీవితాల్లో సంతోషాల వెలుగులు నిండాయి. మండలంలోని మావుడి గిరిజన పంచాయతీలో మునుపెన్నడూ లేని విధంగా అభివృద్ధి జరిగింది. గతంలో గ్రామంలో ప్రభుత్వ పరిపాలన భవనాలు లేవు. కానీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక గ్రామంలో రూ.45.60 లక్షలతో గ్రామ సచివాలయ భవనం, రూ.23.94 లక్షలతో రైతుభరోసా కేంద్రం నిర్మించారు. అలాగే నాడు-నేడు కార్యక్రమం కింద రూ.12 లక్షలతో మావుడి పాఠశాలలో, రూ.14 లక్షలతో బూరివలస పాఠశాలలో అభివృద్ధి పనులు చేపట్టారు. మావుడిలో గిరిజన సంక్షేమ పాఠశాల(జీడీడబ్ల్యూఎస్)లో రూ.40 లక్షలతో అదనపు భవనాలు ఏర్పాటు చేశారు. పురిగానివలస జీపీఎస్‌లో రూ.5.60 లక్షలతో, కె.కొత్తవలస పాఠశాలలో రూ.5.56 లక్షలతో, జీపీవలస ఎంపీపీ స్కూల్‌లో రూ.12 లక్షలతో విద్యార్థులకు అవసరమైన వసతులు కల్పించారు. అలాగే పురిగానివలస, మడవలస, ఎం.కొత్తవలస గ్రామాలకు రూ.3.46 కోట్లతో బీటీ రోడ్లు నిర్మించారు. పంచాయతీ పరిధిలోని అర్హులైన వారికి అమ్మఒడి, జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన, రైతుభరోసా, వైఎస్సార్ చేయూత, సామాజిక పింఛన్లు, తదితర పథకాల కింద రూ.12.53 కోట్లు నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం జరిగింది. ఐదేళ్లలో గ్రామం రూపురేఖలతో పాటు ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడటంతో ప్రతి ఒక్కరూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి, డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొరకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.





గ్రామంలో నిర్మించిన సీసీరోడ్డు



గ్రామ సచివాలయం

జగనన్న ప్రభుత్వంలో గిరిజనులు సంతోషంగా ఉన్నారు



గతంలో రేషన్ సరుకులు తెచ్చుకునేందుకు, ఏ ప్రభుత్వ పథకం కావాలన్నా మండల కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేది. సరైన దారి కూడా లేక ఎన్నో ప్రయాసలు పడ్డాం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ఇంటి వద్దకే రేషన్ సరుకులు, ఇతర ప్రభుత్వ పథకాలు చేరుతున్నాయి. గ్రామాల్లో రోడ్లు వేశారు. పాఠశాలలు అభివృద్ధి చేశారు. మునుపెన్నడూ లేనంతగా మా ఊరు మారిపోయింది. ప్రతి ఒక్కరూ సంతోషంగా జీవిస్తున్నారు.

– పీడిక సుదర్శనరావు, పంచాయతీ సర్పంచ్

పేదల పక్షపాతి సీఎం జగన్



పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

- ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం టౌన్: పేదల సొంతింటి కలను నెరవేర్చిన ఏకైక సీఎం జగన్‌మోహన్ రెడ్డేనని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. పార్వతీపురం పురపాలక సంఘం 3, 4 వార్డుల పరిధిలో గల గృహ లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారుల సమక్షంలో ఎమ్మెల్యే బుధవారం ఎస్ఎన్ఎం నగర్ కాలనీలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో జగనన్న లేఅవుట్లలో స్థలాలు వచ్చిన వారికి లేఅవుట్ రద్దు కాబడిన వారికి, లేఅవుట్ రీ సైజింగ్‌లో స్థలాలు కోల్పోయిన వారికి, 90 రోజుల్లో పెట్టుకున్న వారికి అందరికీ వెంకంపేట ప్రాంతంలో ప్రత్యేకంగా ఇళ్ల స్థలాలు ఏర్పాటు చేశామన్నారు. పేదల పక్షపాతిగా ఉన్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, స్థానిక కౌన్సిలర్లు కోరాడ శ్రీనివాసరావు, నాని, సువ్వాడ లావణ్య, బి.ఆనంద్, జీసీఎస్ పట్టణ కన్వీనర్ జి.మాధవరావు, కన్వీనర్లు గొర్లి శంకరరావు, జల్లు బాబ్జీ, కోరాడ చిట్టి, పాలవలస శ్రీనివాసరావు, ఢిల్లీశ్వరరావు, గోవింద్, గృహసారథులు, కార్యకర్తలు, రెవెన్యూ అధికారులు, సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లు, లబ్ధిదారులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

మలేరియా ప్రభావిత ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి

- డీఎంఓ జగన్‌మోహన్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంఓ జగన్ మోహన్‌రావు

పార్వతీపురం టౌన్: మలేరియా ప్రభావిత ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ టి. జగన్‌మోహన్‌రావు ఆదేశించారు. సబ్ యూనిట్ అధికారులు, మలేరియా టెక్నికల్ సూపర్‌వైజర్స్‌కు జిల్లా మలేరియా కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో వైద్య సిబ్బంది ఎప్పటికప్పుడు ఆరోగ్య సర్వే చేపట్టి గ్రామాలు, వసతి గృహాలు, పట్టణాల్లో జ్వర లక్షణాలున్న వారిని గుర్తించి మలేరియా, డెంగీ నిర్ధారణ పరీక్షలు సత్వరమే జరిగేలా పర్యవేక్షణ చేయాలన్నారు. మీ పరిధిలో ఉండే మండలాల్లో వైద్యాధికారులు, వైద్య సిబ్బంది, పంచాయతీ సిబ్బందితో సమన్వయం జరుపుకుంటూ జ్వర ప్రభావిత ప్రాంతాలు వాటి నివేదికలు, శానిటేషన్ ప్రక్రియ డ్రైడే కార్యక్రమాలు స్ప్రేయింగ్ తదితర అంశాలపై చర్చించి తగు కార్యాచరణ సిద్ధం చేసుకోవాలన్నారు. ఆరోగ్య కేంద్రాల్లో ల్యాబ్ పరీక్షలు నివేదికలు రికార్డులు తరచుగా పరిశీలించాలన్నారు. హాస్టల్స్ సందర్శించి అక్కడ కిటికీలకు మెస్‌ల అమరిక, తీరు సిక్‌రూం నిర్వహణ, కిచెన్ హాస్టల్ పరిసరాల్లో శానిటేషన్ తీరును గమనించాలన్నారు. ఎక్కడైనా జ్వరాలు నిర్ధారణ అయితే వెంటనే తెలియజేయాలన్నారు. ఆ ప్రదేశంలో నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో ఏఎంఓ సూర్యనారాయణ, మలేరియా కన్సల్టెంట్ రామచంద్ర, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురంలో ఆధ్యాత్మిక శోభ



ద్వాదశ జ్యోతిర్లింగ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం టౌన్: మహా శివరాత్రి శుభ బ్రహ్మకుమారి, శివశక్తి భవన్ ఆధ్వర్యంలో పార్వతీపురంలో ఏర్పాటు చేసిన ద్వాదశ జ్యోతిర్లింగముల దివ్య దర్శనం క్షేత్రాన్ని ఎమ్మెల్యే అలజంగి జోగారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తామంతా ఈ రోజు ఇక్కడ ఈ దైవ కార్యక్రమాన్ని నిర్వహించుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. మహాశివరాత్రి దివ్య ఆశీస్సులు వాళ్లపై ఎల్లప్పుడు ఉండాలని జ్యోతి స్వరూపం శివయ్యను కోరుకుంటున్నామని తెలిపారు. మహా శివరాత్రి మహోత్సవంలో కల్యాణార్థం చేయడం జరుగుతుందన్నారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం ఇక్కడ నిర్వహించుకోవాలని ఆ భగవంతుడే నిర్ణయించడం జరిగిందన్నారు. అనంతరం ఎమ్మెల్యేతో కలసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ సభ్యులు కోరాడ శ్రీనివాసరావు, సువ్వాడ లావణ్య, దైవ నిర్వాహకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ల చివరి రోజు నాటికి ఫారం-బి సమర్పించాలి

- ఆర్డీఓ హేమలత



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ హేమలత

పార్వతీపురం టౌన్: నామినేషన్ చివరి రోజు నాటికి ఫారం-బి సమర్పించాలని రెవెన్యూ డివిజనల్ అధికారి, పార్వతీపురం నియోజకవర్గ ఎన్నికల అధికారి హేమలత అన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం ఆర్డీఓ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్వతీపురం నియోజకవర్గంలో 85 పోలింగ్ కేంద్రాల మార్పు, రెండు పోలింగ్ కేంద్రాల లొకేషన్ మార్పునకు ప్రతిపాదనలు ఉన్నాయన్నారు. నామినేషన్ నుంచి పోలింగ్ ఏజెంట్లు, కౌంటింగ్ ఏజెంట్లకు సంబంధించి రాజకీయ పార్టీల ప్రతినిధులు నివేదికలు తయారు చేసుకోవాలని సూచించారు. పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై ఆరా

సాలూరు: ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై ఈఆర్ఓ, ఐటీడీఏ పీఓ పీఓ విష్ణుచరణ్ ఆరా తీశారు. తహసీల్దార్ కార్యాలయానికి బుధవారం వచ్చిన పీఓ కార్యాలయంపైన ఆర్వో రూంగా సిద్ధం చేయాలని తహసీల్దార్ ఆనంద్‌కుమార్‌ను ఆదేశించారు. ఈ సందర్భంగా స్థానిక విలేకర్లతో ఆయన మాట్లాడుతూ, ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని అన్నారు. ఈసీ నిబంధనల ప్రకారం, ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తరువాత అభ్యర్థుల నామినేషన్ దాఖలు చేసేందుకు అభ్యర్థి వెంట నలుగురు వ్యక్తులకు అనుమతి ఇవ్వడం జరుగుతుందన్నారు. అనంతరం డిగ్రీ కళాశాలలో స్ట్రాంగ్‌రూంను ఆయన పరిశీలించారు.

ఎఫ్‌ఎంహెచ్‌డబ్ల్యూపై శిక్షణ



శిక్షణ ఇస్తున్న జిల్లా డీపీఎం త్రినాధమ్మ

బలిజిపేట: ఆహారం, న్యూట్రిషన్, పరిశుభ్రత, తాగునీరు అంశాలపై గ్రామస్థాయి వీఓఏలకు జిల్లా డీపీఎం త్రినాధమ్మ శిక్షణా కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. బలిజిపేట మండల సమాఖ్య కార్యాలయంలో వీఓఏలకు శిక్షణ ఇచ్చారు. ఆహారం అలవాట్లు, తగు మోతాదులో తీసుకునే విధానం, గర్భిణులకు పౌష్టికాహారం అందించడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, మరుగుదొడ్ల వినియోగం, తాగునీరు, పరిసరాల పరిశుభ్రత అంశాలపై తగు సూచనలు అందించారు. గ్రామాల్లో వీఓఏలు మహిళా సంఘాల సభ్యులను చైతన్యపరిచి వారికి తగు సూచనలు అందించాలని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం ఉమామహేశ్వరరావు, సీసీలు పాల్గొన్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష'తోనే ప్రజారోగ్యం



వైద్య శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న సిబ్బంది

సీతానగరం: మండలంలోని సచివాలయాల పరిధిలో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష 2 వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీసీసీబీ డైరెక్టర్ అంబటి కృష్ణంనాయుడు, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.తిరుపతిరావు అన్నారు. అంటిపేట సర్పంచ్ జి.తిరుపతిరావు ఆధ్వర్యంలో సీతానగరం పీహెచ్‌సీ డాక్టర్ బి.పావని పర్యవేక్షణలో జేఏఎస్ 2 వైద్య శిబిరం బుధవారం నిర్వహించారు. ప్రత్యేక వైద్య నిపుణులు రోగులను పరీక్షించారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. ఎంపీటీసీ ఎస్.నిర్మల, పంచాయతీ కార్యదర్శి శశిభూషణరావు, సచివాలయ ఉద్యోగులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



సాలూరు రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీఓ, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ

శివరాంపురంలో..

సాలూరు రూరల్: మండలంలోని శివరాంపురం గ్రామంలో రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం బుధవారం ప్రమీల ఆధ్వర్యంలో జరిగింది. బాగువలస పీహెచ్‌సీ వైద్యాధికారి రవికిరణ్ ఆధ్వర్యంలో రోగులను పరీక్షించారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. అనంతరం సీడీపీఓ సత్యవతి ఆధ్వర్యంలో పలువురు గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఫణీంద్రకుమార్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ, సర్పంచ్ జరజాపు మోహన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పార్వతి, పైడిరాజు, యశోద తదితరులు పాల్గొన్నారు.

'క్రాష్'తో నీటి ఎద్దడి నివారణ



క్రాష్ ప్రోగ్రాం వాహనాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు బాబ్జీ తదితరులు

సీతానగరం: వేసవిలో నీటి ఎద్దడి నివారణకు క్రాష్ కార్యక్రమం చేపట్టినట్టు జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, పార్టీ సీనియర్ నాయకుడు బి.శ్రీరాములునాయుడు అన్నారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో బోర్ల మరమ్మతుల నిమిత్తం క్రాష్ కార్యక్రమం కింద వాహనాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బోర్ల మరమ్మతులకు మంజూరు చేసిన ముడి సరుకుతో సిబ్బంది యుద్ధ ప్రతిపాదికన చర్యలు చేపట్టాలన్నారు. తాగునీటి సమస్య రాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీడీఓ ఎం.ఈశ్వరరావు మాట్లాడుతూ బోర్ల మరమ్మతులకు సంబంధించి ప్రతి రోజూ కార్యాలయానికి నివేదిక అందజేయాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఆర్.పవన్‌కుమార్ మాట్లాడుతూ మండలంలోని తాగునీటి బోర్లు 476 ఉన్నాయని, జగనన్న కాలనీల్లో 74 బోర్లు ఉన్నాయని తెలిపారు. పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, బోరు మెకానిక్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.



క్రాష్ ప్రోగ్రాం వాహనాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు బాబ్జీ తదితరులు

పార్వతీపురం మండలంలో 45 రోజుల పాటు 'క్రాష్'

పార్వతీపురం టౌన్: తాగునీటి ఎద్దడి నివారణకు పూర్తి చర్యలు చేపట్టామని ఎంపీడీఓ అభీబ్‌జావేద్ అన్నారు. బుధవారం బోర్ల మరమ్మతుకు సంబంధించిన వాహనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 45రోజులపాటు క్రాష్ కార్యక్రమం నిర్వహిస్తున్నారన్నారు. రూ.5లక్షల నిధులతో మండలంలోని 30 పంచాయతీలలో ఉన్న 581 చేతి పంపులను పరిశీలించి అవసరమైన మేరకు మరమ్మతులు నిర్వహిస్తామన్నారు. తద్వారా గ్రామాలలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. రానున్న వేసవి దృష్ట్యా ప్రతీ ఒక్కరికి తాగు నీరు అందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపట్టామని ఆయన తెలిపారు.

ప్రజారోగ్యమే ప్రభుత్వ ధ్యేయం

- మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి



రోగులకు మందులు అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ గౌరీశ్వరీ

పార్వతీపురం టౌన్: ప్రజల ఆరోగ్య భద్రతే ప్రభుత్వ ధ్యేయమని మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరీ అన్నారు. పార్వతీపురం పట్టణంలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష -2 కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం పట్ల ప్రభుత్వం ఎంతో శ్రద్ధ వహిస్తుందన్నారు. నాడు-నేడు పథకం ద్వారా ఆస్పత్రుల రూపురేఖలు మార్చడమే కాకుండా ఆస్పత్రుల్లో పూర్తి స్థాయిలో వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచారన్నారు. ప్రతీ గ్రామంలో వైద్య సేవలను చేరువ చేసేందుకు ఓ పక్క ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా వైద్య సేవలు అందిస్తూ, మరో పక్క జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా గ్రామాల్లోనే స్పెషలిస్టు వైద్య సేవలను అందిస్తున్నామన్నారు. జేఏఎస్-2 ద్వారా గ్రామాల్లో స్పెషలిస్టు వైద్యం అందిస్తూ అవసరమైన వారికి ఉన్నత వైద్యం నిమిత్తం ఆరోగ్యశ్రీకి రిఫర్ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, వార్డు వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన

పార్వతీపురం టౌన్: ప్రజలు అగ్నిప్రమాదాల పట్ల అవగాహన కలిగి వుండి చుట్టుప్రక్కల వారిని చైతన్యవంతులను చేయడం ద్వారా ప్రమాదాలను నియంత్రించవచ్చునని అగ్నిమాపక అధికారి పి.పైడిరాజు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాలను పురష్కరించుకొని పట్టణంలోని పెట్రోల్ బంకుల వద్ద అగ్ని ప్రమాదాలపై బుధవారం అవగాహన కల్పించారు.